కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, అక్టోబర్16: జిల్లాలో 8 నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు పంపించామని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లిలో 1, రామగుండంలో3, మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నాలుగు కొత్త పోలింగ్ కేంద్రాలు, రామగుండంలో మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పు, రామగుండంలో 3 పోలింగ్ కేంద్రాలు, మంథనిలో మూడు పోలి కేంద్రాల పేర్ల మార్పు ప్రతిపాదనలు సీఈవోకు పంపామని చెప్పారు. సమావేశంలో నాయకులు పీ సంపత్ రావు, శశి భూషణ్, రవీందర్, రాజ్ కుమార్, మల్లారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు

పత్తిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ ఆదేశించారు. పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్‌ను అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. రైతులు తమ పత్తిని తక్కువ ధరకు దళారులు, మధ్యవర్తులకు, ఇతరులకు అమ్ముకోవద్దని సూచించారు. ఈనెల 16 నుంచి ఎంపిక చేసిన మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిచామని తెలిపారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, డీఏవో దోమ ఆది రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి పీ రంగారావు, జిల్లా తూనికల కొలతల అధికారి విశ్వేశ్వర్ , మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు ఓనర్లు, అడ్డిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణలో ఇబ్బందులుంటే దరఖాస్తు చేసుకోవాలి

రామగిరి మండలం బుధవారంపేటలో చేస్తున్న భూ సేకరణ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉంటే దరఖాస్తు ఇవ్వాలని అదనపు కలెక్టర్ శ్యామ్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. బుధవారంపేటలో సింగరేణి భూసేకరణ ప్రక్రియపై సంబంధిత రైతులతో సమీక్షించారు. సింగరేణి ఆర్జీ -3 కి సంబంధించి బుధవారంపేటలో 88.20 ఎకరాల భూమి సేకరిస్తున్నామని తెలిపారు. భూ సేకరణ అవార్డు ఎంక్వైరీ, పీఎన్‌డీపీ సమయంలో ఎవరైనా రైతులు తప్పిపోయినా, లేదా రైతుల పొలాల్లోనే చెట్ల నిర్మాణాలు నమోదు కాకపోతే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సింగరేణి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ రైస్ సరఫరా చేయాలి

వానకాలం 2023-24 , యాసంగి 2023-24 సీజన్లకు సంబంధించి పెండింగ్ రైస్ సకాలంలో సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో పెండింగ్ రైస్ డెలివరీపై బుధవారం సమీక్షించారు. రా రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని ప్రాసెస్ చేసి ప్రతి రోజు వాటి సామర్థ్యం మేరకు అత్యధిక ఏసీకేలు డెలివరీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, రైస్ మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, అక్టోబర్16: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయని, పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులను వారం వ్యవధిలో పూర్తి చేసి సంబంధిత బిల్లులు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు, టాయిలెట్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, ముఖ్య ప్రణాళిక అధికారి జీ రవీందర్, పీఆర్ ఈఈ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, ఏఈలు పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఉద్యోగోన్నతులు రావాల్సిన అంగన్‌వాడీ సహాయకుల జాబితా వివరాలను శనివారం వరకు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్‌ను ఆదేశించారు. సమావేశంలో సీడీపీవో కవిత, అధికారులు పాల్గొన్నారు.

ధర్మారం : మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి

వారం వ్యవధిలో పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జీపీల్లో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. జీపీల్లో నిధుల ఆధారంగా క్యాపిటల్ పనులు చేపట్టాలన్నారు. సీసీ చార్జీలు, మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు కచ్చితంగా చెల్లించాలన్నారు. కాల్వ శ్రీరాంపూర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సమావేశంలో డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్పీవో వేణుగోపాల్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ధర్మారం, అక్టోబర్ 16: ప్రభుత్వ భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధించిన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ధర్మారంలో బుధవారం పర్యటించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఏసీఎం కార్యాలయాలను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఖిలావనపర్తి శివారులోని ప్రభుత్వ భూములను పకడ్బందీగా సర్వే చేసి ఈనెల 18 వరకు నివేదిక అందించాలని తహసీల్దార్ ఎండీ ఆరిఫోద్దీన్‌ను ఆదేశించారు. బొమ్మారెడ్డిపల్లి శివారులోని ప్రభుత్వ భూముల సర్వే ప్రారంభించాలన్నారు. ధర్మారంలోని ఏపీఎం కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీఎం,సీసీలకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో బీ గంగయ్య, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేశ్, ఏపీఎం తులసీ మాత, ఏపీవో రవి పాల్గొన్నారు.

మొబైల్ షాపులకు పవర్ కట్

ఆందోళ న చేస్తున్న మొబైల్ షాపుల నిర్వాహకులు

కోల్‌సిటీ, అక్టోబర్ 16: గోదావరిఖని ఓల్డ్ అశోక సెంటర్‌లోని మొబైల్ షాపులకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను తొలగించారు. గతంలో రోడ్ల వెడల్పులో భాగంగా ఓల్డ్ అశోక్ థియేటర్‌ను కూల్చివేసిన సమయంలో వీకే రెడ్డి హోటల్ లైనులో ఉన్న దాదాపు 23 మొబైల్ షాపులను సైతం తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఆయా షాపులకు కరెంటు సరఫరా నిలిపివేశారు. ఎలాంటి నోటీసు, ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపించకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం పై ఆయా షాపుల నిర్వాహకులు ఆందోళనకు దిగారు. విద్యుత్ సిబ్బందిని వ్యాపారులు సంప్రదించారు. పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సరఫరాను నిలిపివేసినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారని వ్యాపారులు తెలిపారు. తమ పొట్ట కొట్టడం సరికాదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన చౌరస్తాలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడో అంతస్థులో అద్దెకు ఉండాలని చెబుతున్నారని, వేలకు వేలు అద్దెలు చెల్లించే పరిస్థితుల్లో తాము లేమని చెప్పారు.

ట్రినిటీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

హాజరైన విద్యార్థినులు

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 16 : పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రినిటీ ఫౌండర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడారు.. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు పెద్దపల్లిలోనే కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సులువుగా ఉద్యోగాలు సాధించేలా ఇండస్ట్రియల్ విజిట్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, సెమినార్స్ నిర్వహిస్తూ, వారిలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేశ్, డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ కౌసల్య, రామ్మోహన్, రమేశ్, శ్రీలత, సాయి, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

జూలపల్లి, అక్టోబర్ 16 : పెద్దాపూర్‌లోని 'ఆదర్శ' పాఠశాలలో అధ్యాపకుల ఎంపికకు గురువారం ఉదయం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ. షాదుల్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు అర్థశాస్త్రం, హిందీ బోధించేందుకు ఎంఏతోపాటు ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అధ్యాపకులకు గంటల ప్రాతిపదిక వేతనం అందిస్తామని పేర్కొన్నారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 16: కేయూ దూరవిద్య అడ్మిషన్ల ప్రవేశాల గడువును ఈ నెల 30 వరకు పొడగించినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వడ్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ద్వారా డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులు, లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, హెచ్ ఆర్ఎం, సైకాలజీ, యోగా, పీజీలో సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సెల్ 834138500లో సంప్రదించవచ్చని తెలిపారు.

చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు

సుల్తానాబాద్ రూరల్, అక్టోబర్ 16 : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కనుకులలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ మాట్లాడారు. ప్రతి మారుమూల గ్రామ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందాలనే ఉద్దేశ్యంతో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించి సుల్తానాబాద్ కోర్టులో న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయ సహాయం అందిస్తామన్నారు. గ్రామాల్లో వివిధ పనులకు వెళ్ళే కార్మికులకు ప్రభుత్వం భీమా సౌకర్యాన్ని కల్పిస్తుందని, దీనిని వినియోగించుకోవాలని సూచించారు. వరకట్నం తీసుకోవడం నేరమని, దీనికి అరికట్టాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ అవుల లక్ష్మీ రాజం, లోక్ అదాలత్ సభ్యులు ఆలూరి శ్రీనివాస రావు, న్యాయవాదులు మేకల తిరుపతిరెడ్డి, ఆకారపు సరోత్తంరెడ్డి, నేరెళ్ల శంకరయ్య, గ్రామ కార్యదర్శి రాధలతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రశాంత్ మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో డిగ్రీ, పీజీ కళాశాలలు మూసివేశారన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, నాయకులు గద్దల సిద్ధార్థ, అభిరామ్, అనిరుధ్, సాగర్, మనోహర్ ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి..

పెద్దపల్లిటౌన్, అక్టోబర్ 16: పెండింగ్‌లో ఉన్న రూ.7,500కోట్లకు పైగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, షాస్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లిస్తే తప్ప కళాశాలలను నడుపుకోలేమని యాజమాన్యాలు చెత్తేలేశయని, మధ్యలో ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు వెళ్లలేక విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

జిల్లా సంక్షేమశాఖ అధికారిగా వేణుగోపాల్‌రావు

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 16: ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారిగా పీ వేణుగోపాల్ రావును నియ మిస్తున్నట్లు మహిళాభివృది, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సంక్షేమశాఖ అధికారిగా రవూఫ్ ఖాన్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసినా ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. రవూఫ్‌ఖాన్ భార్య మంచిర్యాల జిల్లాలో పనిచేస్తుండడంతో స్పౌస్ కోటాలో అక్కడ బాధ్యతలు చేపడుతారేమోననే చర్చ జిల్లా అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతుంది.

పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

ముత్తారం, అక్టోబర్ 16: ఖమ్మంపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు బుధవారం బైఠాయించారు. గతేడాది దసరా, దీపావళి పండుగలు, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కూలి పనులు చేశామని తెలిపారు. పంచాయతీ తీర్మాణం మినిట్స్ బుక్ లో కూడా కూలీల బిల్లులు చేయాలని పంచాయతీ సెక్రటరీ నమోదు చేశారని తెలిపారు. ఏడాది గడిచిన ఇప్పటి వరకు కూలీల బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఓవర్‌మెన్‌లకు వెబ్ కౌన్సెలింగ్

గోదావరిఖని, అక్టోబర్ 16: సింగరేణి ఆర్జీ-1 పరిధి జీడీకే 1,3, 2,2ఎ, 11 అండర్ గ్రౌండ్ గనుల్లో పనిచేస్తున్న ఓవర్‌మెన్‌లకు ఓపెన్‌కాస్ట్ గనుల్లో పని చేసేందుకు బుధవారం టీటీసీలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీ-1 కమిటీ సభ్యులు, ఇన్‌చార్జి ఎస్వోటు జీఎం ఆంజనేయప్రసాద్ కౌన్సెలింగ్ చేశారు.కమిటీ సభ్యులు ఏజీఎం ఐఈ ఆంజ నేయులు, పీఎం రవీందర్‌రెడ్డి, అశోక్‌రావు ఉన్నారు.

నియామకాలు

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 16: తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా దామ సదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పాలకుర్తి, అక్టోబర్16: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా సయ్యద్‌ఖాదర్‌పాషాను నియమిస్తున్నట్లు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యలకు సయ్యదర్ ఖాదర్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో దేవాలయాలకు రక్షణ కరువు

- ప్రతి బూత్‌లో 2 వందల సభ్యత్వాలు చేయాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్

పెద్దపల్లి టౌన్, అక్టోబర్16: కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో దేవాలయాలకు రక్షణ లేకుండా పోతున్నదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతమవుతుందన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ సభ్యత్వాలు 2 వందలు దాటేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ సభ్యత్వ ప్రముఖ్ పొల్సాని సంపత్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు,రాజగోపాల్, తిరుపతి యాదవ్, ఉప్పు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన విద్యుత్ ఉద్యోగులు

రామగిరి, అక్టోబర్ 16: రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో బుధవారం పలువురు విద్యుత్ ఉద్యోగులు విధుల్లో చేరారు. చేరారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో భాగంగా వీరంతా బదిలీపై వచ్చారు. బేగంపేట సెక్షన్ పరిధిలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్ (రామగిరి), లైన్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు (ముస్త్యాల), నవీన్ కుమార్ (బేగంపేట), లైన్‌మెన్లు శివకుమార్ (రామగిరి), రాజేందర్ (ముస్త్యాల), ఏ శ్రీనివాస్(కల్వచర్ల), రమేశ్ (బేగంపేట), అసిస్టెంట్ లైన్‌మెన్లు నాగరాజు (సుందిళ్ల), రాజేష్ (ముస్త్యాల) రత్నాపూర్ సబ్ స్టేషన్‌లో ఎస్ఈ సతీశ్‌ను కలిసి విధుల్లో చేరారు. కమాన్‌పూర్ సెక్షన్ పరిధిలో అసిస్టెంట్ ఇంజినీర్ అశోక్, సబ్ ఇంజినీర్ శ్రవణ్ కుమార్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ అశోక్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రావు, లైన్‌మెన్లు కలవేన ఓదెలు, నాగరాజు, ఎల్ఎంవోలు రఘుపతి రెడ్డి, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్, వెంకటస్వామి విధుల్లో చేరారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో గోల్డ్ మెడల్

ముత్తారం, అక్టోబర్ 16: మండలంలోని సీతంపేటకు చెందిన లింగం శ్రీహన్స్ కార్తీకేయ ఆర్చరీ విభాగంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఐ) ఛాంపియన్ షిప్ లో భాగంగా ఆర్చరీ విభాగంలో లింగం శ్రీహాన్స్ కార్తికేయ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. కార్తీకేయ కరీంనగర్‌లోని అల్ఫోర్స్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆయన తండ్రి పెద్దపల్లి జిల్లా అప్పన్నపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా లింగం శ్రీహన్స్ కార్తికేయ, కోచ్ డీ శ్రీనివాస్‌ను, సీతంపేట గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

'ఖని'లో అలాయ్-బలాయ్

వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

కోల్‌సిటీ, అక్టోబర్ 16: గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో సామాజిక ఐక్య వేదిక ఆధ్వర్యంలో అలాయ్ -బలాయ్ ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా వంటకాలు తయారు చేశారు. తెలంగాణ రుచులు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు మేరగు హనుమంతు గౌడ్, డాక్టర్ రాజేందర్, బొంకూరి మధు, నటరాజ్, లక్ష్మణ్, మైస రాజేశ్, ఇరుగురాల కిష్టయ్య, దుబాసి బొందయ్య, శనిగరపు రామస్వామి, బూడిద మహేందర్, కోడూరి రమేశ్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వైద్య శిబిరం

ఓదెల, అక్టోబర్ 16: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలోని సిబ్బంది, భక్తులకు కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 150మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, డాక్టర్ దీక్షిత్, ఆలయ సిబ్బంది, వైద్య సిబ్బంది హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 16: మండలంలోని కుర్మపల్లిలో బుధ వారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బీ శంకర్ పరిశీలించారు. 165 పశువుల కు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసహాయకులు వీ సంపత్‌కుమార్, ఎన్ స్రవంతి, రాకేష్, మనోహర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ధర్మారం,అక్టోబర్16: నంది మేడారం పశువైద్య ఉప కేంద్రంలో వెటర్నరీ డాక్టర్ అజయ్ కుమార్ పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఆవులు,గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వో ఎండీ షరీఫ్, జీవీవో రాజేందర్, గోపాల మిత్రలు తిరుమల రాజేశం, వెంకటేశం, మల్లేశం పాల్గొన్నారు.

సాధికారత దిశగా ముందుకు సాగాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 16: ప్రస్తుత సమాజంలో మహిళలు సాధికారత దిశగా ముందుకు సాగాలని సఖీ కేంద్రం జిల్లా కోర్డినేటర్ దారవేన స్వప్న, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. పెద్దకల్వలలో బుధవారం మహిళలతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ చంద్రు స్వప్న, ఫైనాన్స్ లిటరసీ సేరు సంధ్యారాణి, సమత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎలిగేడు ,అక్టోబర్ 16 : ఎలిగేడు సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోదల శ్రీనివాస్‌రెడ్డి(56) మంగళవారం పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు బుధవారం శ్రీనివాసరెడ్డి భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు నివాళుర్పించారు.

బాధ్యతల స్వీకరణ

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 16: గోదావరిఖని టూటౌన్ ఎస్ఐగా సోనియా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టౌన్ సీఐ ఎన్. ప్రసాద్‌రావుకు పుష్పగుచ్చం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో రామగుండం సీపీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న సోనియాను ఖని టూటౌన్‌కు బదిలీ చేశారు. ఠాణాలో నాలుగో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

జ్యోతినగర్ (రామగుండం), అక్టోబర్ 16: రామగుండం ఠాణా ఎస్ఐగా గుండేటి సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. సంధ్యారాణి భూపాల్‌పల్లి ఠాణా నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగోన్నతి

పాలకుర్తి, అక్టోబర్ 16: బసంత్‌నగర్ కేశో